జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 22-6-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 707 పేజీలు: 4 వెల : రూ.7



# గోల్డ్ స్కీం పేరిట.. స్కాం...!




☀ 11నెలలు బంగారంపై పెట్టుబడి పెడితే.. 12 నెల మేమే కడతాం ☀ బంగారు ఆభరణంపై మజూరీ తీసుకోం అంటూ మోసం ☀ బంగారానికి బదులు బాండ్లు ☀ అందమైన బ్రోచర్లతో కొనుగోలుదారులను నట్టేట ముంచుతున్న నిర్వాహకులు ☀ నిత్యం మారుతున్న బంగారం ధరలు ☀ 24 క్యారట్ బంగారం బిస్కెట్లు ఇచ్చినా.. డబ్బులు తగ్గించి ఇస్తున్న యజమానులు ☀ జీఎస్టీ లేదు లేదంటునే బిల్లులో వేసి మోసం ☀ ఎవరైనా గట్టిగా నిలదీస్తే మీకు నచ్చినట్టు చేసుకోమంటున్న యజమానులు ☀ సిండికేట్‌గా మారిన బంగారం వ్యాపారులు, నిర్వాహకులు ☀ నిద్దరోడుతున్న వాణిజ్య పన్నుల శాఖాధికారులు ☀ బంగారం షోరూంలపై దాడులు చేసే వారే కరువు ☀ నెలవారీ మామూళ్లు అందడమే కారణమన్న విమర్శలు

శ్రీకాకుళం, జూన్ 21 (వార్త): రోజురోజుకూ బంగారం ధర పెరుగుతోందని.. మున్ముందు కొనుగోలు చేయడం కష్టమవుతుందని.. ప్రతి ఒక్కరూ మంత్లీ స్కీంలో భాగస్వామ్యం కావాలని.. ఈరోజు ఉన్న ధర పెట్టి కొనుగోలు చేసి బాండ్ తీసుకుంటే ఏడాది తర్వాత ఇప్పుడున్న ధరకే బంగారం ఇస్తామని.. 11 నెలలు పాటు మీరు మంత్లీ స్కీంలో చేరితే.. 12వ నెల డబ్బులు మేమే కడతామని.. మీరు తీసుకున్న బంగారు ఆభరణాలకు ఎటువంటి మజూరీ ఉండదని, జీఎస్టీ కట్టనక్కర్లేదని చెబుతూ బంగారం షాపుల యజమానులు, నిర్వాహకులు కొనుగోలుదారులకు మోసపుచ్చుతున్నారు. అందమైన బ్రోచర్లను ఇంటింటికీ పంపిణీ చేస్తూ తమ తమ షాపుల్లోకి వచ్చి కట్టేలా ఆకట్టుకుంటున్నారు. అలాగే మంత్లీ గోల్డ్ స్కీంలో చేరి మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ కట్టిన వారికి గిఫ్టులు కూడా ఇచ్చేస్తున్నారు. తక్కువ ధరకే బంగారం, డబుల్ గోల్డ్ స్కీమ్స్, బంగారు బిస్కెట్లు ఇస్తామని నమ్మించి, కోట్లాది రూపాయలు వసూలు చేసి మోసం చేస్తున్నారు. మీరు కట్టిన డబ్బులకు రెండింతల బంగారం ఇస్తామని లేదా ప్రతి నెలా భారీగా డబ్బులు లేదా బంగారం రిటర్న్స్ వస్తాయని ఆశ చూపిస్తారు. మార్కెట్ ధర కంటే చాలా తక్కువ ధరకు బంగారం బిస్కెట్లు ఇస్తామని నమ్మించి, ముందస్తుగా డబ్బులు వసూలు చేస్తున్నారు. రియల్ గోల్డ్ బాండ్స్ లేదా స్కీమ్ పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి ప్రజల వద్ద నుండి డబ్బులు గుంజేస్తున్నారు. పలు బంగారం షాపుల యజమానులు, నిర్వాహకులు గోల్డ్ స్కీం పేరిట చేస్తున్న స్కాం విషయం తెలియక కొనుగోలుదారులు మోసపోతున్నారు. షాపుల్లో పనిచేసే వారికి నెలవారీ టార్గెట్ ఇస్తున్నారు. టార్గెట్ చేయని వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరింపులకు సైతం నిర్వాహకులు పాల్పడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీంతో షాపుల్లో పనిచేస్తున్న వారు తమకు తెలిసిన వారిని గోల్డ్ స్కీంలో తప్పనిసరి పరిస్థితుల్లో చేర్పిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో సుమారు వెయ్యికిపైగానే బంగారం షాపులు ఉన్నాయి. వాటిలో కార్పొరేట్ స్థాయిలో బడా షాపులు ఇటీవల పెరిగాయి. శ్రీకాకుళం జీటీ రోడ్డు, పాలకొండ రోడ్డులోనే కార్పొరేట్ బంగారం, వజ్రాల షాపులు వెలిశాయి. అలాగే నరసన్నపేట, టెక్కలి, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం, ఆమదాలవలసలోనూ బడా బంగారం షాపులు ఉన్నాయి. రోజుకు కోట్లాది రూపాయలు వ్యాపారం సాగుతోంది. బంగారం వ్యాపారానికి నరసన్నపేట కేరాఫ్‌గా చెప్పవచ్చు. నరసన్నపేటకు చెందిన కొందరు వ్యాపారులు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో కోట్లాది రూపాయలు లావాదేవీలు నడుపుతున్నారు. బంగారం షాపుల యజమానులు, నిర్వాహకులకు.. బంగారం ఏయే ప్రాంతం నుంచి వస్తుంది, ఎవరు తెస్తున్నారు, ఎలా వస్తున్నది అన్నది ఆ పెరుమాళ్‌కే ఎరుక. ఇదంతా గుట్టుగా సాగుతోంది. గత కొద్ది సంవత్సరాల కిందట ఓ ప్రైవేట్ ట్రావెలర్స్ బస్సులో విజయవాడ నుంచి బంగారం వస్తుండగా పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. అప్పట్లో ఇది పెద్ద సంచలనమే అయింది. ఏజెన్సీ ప్రాంతాల్లో కొందరు వ్యాపారులు గిరిజనులను మోసగిస్తున్నారు. గిరిజనులకు తక్కువ క్యారెట్ ఉన్న బంగారం, హాల్‌మార్క్ లేని ఆభరణాలు విక్రయిస్తూ కాసులు కొల్లగొడుతున్నారు.

## పాత బంగారానికి తక్కువ ధర..

ఎవరైనా బంగారం షాపులకు వెళ్లి తమ పాత బంగారం ఆభరణాలు అమ్మకానికి పెడితే.. యజమానులు, నిర్వాహకులు వాటికి ఏవిధంగా లెక్కగడుతున్నారో ఎవరికీ తెలియదు. ఆ లెక్కలన్నీ గందరగోళమే. తరుగు పేరుతో తప్పుడు లెక్కలు వేస్తూ మోసపుచ్చుతున్నారు. పాతబంగారు ఆభరణాలకు షాపుల యజమానులు ఎంతిస్తే.. అంతే తీసుకుని వెళ్లిపోతున్నారు. ఇక 24 క్యారెట్ బంగారు బిస్కెట్లు ఇస్తే మాత్రం.. ఆరోజ ధర ఇవ్వడం లేదు. మేం ఇంతే ఇస్తాం.. మీకు ఇష్టముంటే తీసుకోండి.. లేకుంటే వెళ్లిపోండని చెబుతున్నారని కష్టమర్లు చెబుతున్నారు.

## తనిఖీలు.. అంతంత మాత్రమే..

బంగారం షాపుల నిర్వాహకుల మోసాలపై ఫిర్యాదు చేసే వారు లేకపోవడంతో సంబంధిత శాఖల అధికారుల తనిఖీల ఊసేలేదు. వాణిజ్య పన్నుల శాఖ అధికారులు బంగారం షాపుల వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. ఏడాదికోసారి జిల్లాలో ఎక్కడో ఒకచోట తనిఖీ చేసి ఆ తర్వాత చేతులు దులిపేసుకుంటున్నారు. ఈ బంగారం షాపుల యజమానులు, నిర్వాహకులు సిండికేట్‌గా మారి.. సంబంధిత శాఖల అధికారులు తమ షాపులపై తనిఖీలు చేయకుండా మామూళ్లు ఇస్తున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఇటీవల నరసన్నపేటలోని ఓ బంగారం షోరూంలో తనిఖీకి రావడంతో జిల్లా వ్యాప్తంగా బడా షోరూంలు మినహా మిగతావన్నీ మూతపడ్డాయి.

## ఆశపడి మోసపోవద్దు..

జిల్లాలోని కొన్ని బంగారం షాపుల నిర్వాహకులైతే మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు లేదా రెండింతల బంగారం ఇస్తామని చెబుతుంటారు.. వారిని నమ్మవద్దు. ఏదైనా స్కీమ్‌లో చేరేముందు ఆ జ్యువెలరీ షాప్ లేదా కంపెనీకి ప్రభుత్వ గుర్తింపు ఉందా లేదా, హాల్‌మార్క్ లైసెన్స్ ఉన్నాయో లేదో పరిశీలించండి. అడ్వాన్స్ పేరుతో పెద్ద మొత్తంలో నగదు ఒకేసారి చెల్లించడం ప్రమాదకరం. మీరు చెల్లించే ప్రతి రూపాయికి కంపెనీ లెటర్‌హెడ్, జి.ఎస్.టి నంబర్ ఉన్న పక్కా రసీదును పొందాలి.

**శ్రీకాకుళం నగరంలోని ఓ బంగారం షోరూంలో హాల్‌మార్క్‌లేని, నాసిరకం బంగారు ఆభరణాలు విక్రయంపై పూర్తి ఆధారాలతో త్వరలో 'జాతీయ వార్త'లో సమగ్ర కథనం..**

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

## శ్రీకాకుళం

# ఇచ్ఛాపురంలో వైసీపీ గెలుపే లక్ష్యం

**-బారువాలో పార్టీ సమావేశం**

**- టీడీపీ నుంచి వైసీపీలోకి వలసలు**



**సోంపేట జూన్ 21(వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కలిసికట్టుగా కృషి చేద్దామని నేతలు పిలుపు నిచ్చారు. ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త సాడిశ్యాం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం బారువలోని వీ కన్వెన్షన్ లో నిర్వహించిన కార్యక్రమంలో బారువ, బారువ కొత్తూరు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ నేతలు, కార్యకర్తలు వైసీపీలో చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణ దాస్, జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, పార్టీ పరిశీలకుడు లక్ష్మణరావు తదితరుల సమక్షంలో సుమారు 70 మంది వైసీపీ కండువాలను ధరించారు. బారువ మేజర్ పంచాయతీలో సీనియర్ టీడీపీ నేత రాజేష్ ఖన్నా ఆధ్వర్యంలో సుమారు 50 మంది వైసీపీ తీర్థం పుచ్చు కోగా, కొత్తూరు గ్రామం నుంచి సుమారు 20 మంది వైసీపీలో చేరారు. తెలుగుదేశం పార్టీలో విసిగి వేసారిపోయి, ఎటువంటి సంక్షేమ పథకాలకు నోచుకోక పార్టీలో గుర్తింపు లేక, గౌరవం లేక వైసీపీ అధినేత వైయస్ జగన్ నిబద్ధత, సమర్థతకు మెచ్చి ఆ పార్టీ ఆశయాలకు ఆకర్షితులమై వైసీపీ లో చేరుతున్నట్లు రాజేష్ ఖన్నా ప్రకటించారు. రానున్న ఎన్ని కల్లో బారువ మేజర్ పంచాయతీ నుంచి వైసీపీకి భారీ మెజార్టీ కట్టబెడతామని పేర్కొన్నారు. అనంతరం కృష్ణదాస్ మాట్లాడుతూ అవినీతి, అక్రమాలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించింది ఏమీ లేదన్నారు. భారీ అవినీతి, లక్షల కోట్ల అప్పులు తప్ప ప్రజలకు అందిం చిన సంక్షేమం శూన్యమని ఎద్దేవా చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ విజయ మాట్లాడుతూ చంద్రన్న పాలనలో ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతికి అధిక ప్రాధాన్యం ఇస్తూ అమరావతి పేరుతో కోట్లు కొల్లగొడుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ రామా రావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో అనేక పథకాలను ఇప్పటికే మూసేశారని ఆరోపించారు. ఒక్కసారి మాత్రమే ఉచిత గ్యాస్ ఇచ్చి తుస్సుమనిపించారని విమ ర్శించారు. నర్తు నరేంద్ర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అరాచక పాలనపై ఇప్పటికే ప్రజలు విసిగి వేసారిపోయారని, మళ్లీ సాధారణ ఎన్నికలు ఎప్పుడెప్పుడా అంటూ రాష్ట్ర ప్రజ లంతా వైసీపీ వైపు ఎదురుచూస్తున్నారన్నారు. సమన్వయకర్త శ్యాం ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ 12 ఏళ్లుగా ఎమ్మెల్యే పదవి చేపడుతున్న అశోక్ ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఏం సాధించారని ప్రశ్నించారు. నాలుగు నెలల క్రితం జింకి భద్ర, బెంకిలి గ్రామాల్లో వందలాది ఎకరాల్లో టమాటా పంట నాశనం కాగా పరిశీలించిన ఎమ్మెల్యే అశోక్ హామీలు ఇవ్వడం తప్ప ఆచరణలో మాట నిలకడ లేదని దుయ్యబ ట్టారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎక్కడా చెప్పుకోదగ్గ ప్రగతి లేదని విమర్శించారు. రానున్న కాలం వైసీపీ దేనని, అభివృద్ధి, సంక్షేమాన్ని మళ్లీ ప్రజలకు మెండుగా అందిస్తా మని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సోంపేట, కంచిలి ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాసు, పైల దేవదాసు రెడ్డి, సోంపేట జడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, చల్లా దేవ రాజు, తడక జోగారావు, ఎర్ర రజినికుమారి, బారువ పంచా యతీ వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి నిరంతర ప్రక్రియ



**జి.సిగడాం, జూన్ 21(వార్త):** ఆనందపురం, ఆబోతులపేట గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరచాలన్నదే తన సంకల్పమని గ్రామ నీటి సంఘం అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకులు చిత్తిరి తిరుపతిరావు అన్నారు. ఎమ్మెల్యే ఈశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చొరవతో శనివారం అబోతుల పేట గ్రామంలో ఎస్సీ కాలనీకి రూ.5 లక్షలతో సీసీ రోడ్డు, రిటైనింగ్ వాల్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల అభి వృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గత వైస్‌ఆర్సీపీ ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. దేశాభివృద్ధి ప్రధాని నరేంద్ర మోడీతోనే సాధ్యపడుతుందన్నారు. ప్రపంచంలో భారతదేశాన్ని అన్ని రంగాల్లో నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దాలనే సంకల్పంతో కేంద్రం పని చేస్తుందన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పని చేస్తున్నారని పెర్కోన్నారు. ఎచ్చెర్ల నియోజక వర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఎన్ఈఆర్, కలిశెట్టి పని చేస్తున్నా రని తెలిపారు కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పొగిరి నారాయణ రావు, పీస సన్యాసమ్మ, సంతోష్, దర్మేంద్ర, రాంబాబు, రాజు తదితర గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

## మందసలో యోగా దినోత్సవం



**మందస, జూన్ 21(వార్త):** అంతర్జాతీయ యోగా దినోత్సవం-2026 సందర్భంగా ఆదివారం మందస ఉన్నత పాఠశాల గ్రౌండ్ ప్రాంగణంలో యోగా మిత్రుల ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్ఫూర్తితో యోగాను ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని ఆనందోత్సా హాల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో మందస మండల అభివృద్ధి అధికారి వై.వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొని యోగా యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అలాగే మండల కార్యాలయ సిబ్బంది, మాజీ సర్పంచ్ ప్రతినిధి చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, యోగ గురువు దేవరశెట్టి కామేశ్వరరావు, జగదీష్ పండా, యోగా బృంద సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొని వివిధ యోగా ఆసనాలను ప్రదర్శించారు. యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగా చేయాలని వక్తలు సూచించారు. కార్యక్రమం అనంతరం పాల్గొన్న వారందరికీ ఆరోగ్యకరమైన పోషకాహారాన్ని అందజేసి కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు.

## కొత్తపల్లి, సొండిపూడిలో యోగా డే



**మందస, జూన్ 21(వార్త):** ఇంటర్నేషనల్ యోగా డే సందర్భంగా మందస మండలంలోని సొండిపూడి, కొత్తపల్లిలలో గల జడ్పీహెచ్ఎస్ లలో ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. వక్తలు మాట్లాడుతూ యోగా నిత్యజీవితంలో ఒక భాగంగా మన అనుసరిస్తే అనేక రోగాలకు దూరంగా ఉండవచ్చుని, యోగాసనాలు ప్రతీ ఒక్కరు రోజు వేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నగిరి కరుణాకర్, గణిత ఉపాధ్యాయుడు గవ్వ భీమారావు, జి.చిన్నికృష్ణ, బి.రమేష్. సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ బి.కీర్తన, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాటమ్మ తల్లి సంబరాలకు శ్రీధర్ విరాళం



**పలాస, జూన్ 21(వార్త):** కాటమ్మతల్లి సంబరాలకు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రముఖ న్యాయవాది దువ్వాడ శ్రీధర్ (బాబా) ఆదివారం సంపత్ వినాయక యూనియన్ నాయకులకు విరాళం అందజేశారు. పలాస పట్టణంలోని శ్రీ సంపత్ వినాయక లోకల్ ఆటో డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న కాటమ్మ తల్లి సంబరం సందర్భంగా పవిత్ర దైవ కార్యక్రమానికి బాబా రూ.10,000 అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాటమ్మ తల్లి అమ్మవారి ఆశీస్సులు పలాస నియోజకవర్గం ప్రజ లందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, అమ్మవారి కృపతో ప్రతి ఇంటా సుఖ శాంతులు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, ఆనందాలు వెల్లివిరియాలని ఆ జగన్మాతను మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నానని తెలిపారు. కాటమ్మ తల్లి కృపా కటాక్షాలు పలాస ప్రజలందరికీ కలగాలని కోరారు.

## ఉద్దానం యువకుడు తెలంగాణలో మృతి

**సోంపేట, జూన్ 21 (వార్త)** ఉద్దానం ప్రాంతం సోంపేట మండలం తోటవూరు గ్రామానికి చెందిన రిక్క భరత్ అనే యువకుడు తెలంగాణ రాష్ట్రంలో శనివారం రాత్రి అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. రంగారెడ్డి జిల్లా షేర్ లింగంపల్లి మండలం చందానగర్ పోలీస్ స్టేషన్ సమీపంలో గల ఒక లాడ్జిలో భరత్ మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆదివారం వేకువజామున ఓ యువతి భరత్ పెదనాన్నకు ఫోన్ చేసి సమాచారం అందించడంతో తోటవూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. చందానగర్ విఆర్ షటిల్ కోచింగ్ సెంటర్లో భరత్ షటిల్ కోచ్ గా పని చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. తండ్రి మూడు నెలల క్రితమే మృతి చెందగా తల్లి మాత్రమే స్వగ్రామం తోట ఊర్లో నివసిస్తుంది. కొడుకు మృతి చెందిన విషయం తెలిసి తల్లి గుండెలవిసేలా ఆరోదిస్తోంది. సమీప బంధువైన మాజీ జడ్పీటీసీ సభ్యుడు సూరాడ చంద్రమోహన్ తోపాటు గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యుడు దిలీప్ కుమార్ సమాచారం తెలిసిన వెంటనే రంగారెడ్డి జిల్లాకు పయనమయ్యారు . ఆదివారం అక్కడే పోస్ట్ మార్టం జరిపించి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువస్తున్నారు.





## నిత్య జీవితంలో యోగా భాగం కావాలి

**- పీఏసీఎస్ అధ్యక్షుడు మోహనరావు**

**- చాపర జడ్పీ హైస్కూల్లో ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవం**

**మెళియాపుట్టి, జూన్ 21(వార్త):** నేటి ఆధునిక సమాజంలో వ్యక్తులు ఆయా రంగాలలో లేచింది మొదలుకొని ఉరుకుల పరుగు లతో దైనందిన జీవన ప్రయాణంలో సాగిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ శారీరక మానసిక ప్రశాంతత పొందే క్రమంలో భాగంగా యోగా ఒక భాగం కావాలని కోసమాల పీఏసీఎస్ అధ్యక్షుడు సలాన మోహనరావు అన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మెళియాపుట్టి మండలం చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో యోగా కార్యక్రమాన్ని ఘనంగా ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా, మండల విద్యా శాఖా ధికారులు ఎస్.దేవేంద్రరావు, మల్లారెడ్డి పద్మనాభం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ సంస్కృతికి ప్రతీకైన యోగాను దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఐక్యరాజ్యసమితిలో తీర్మానం ప్రవేశపెట్టి అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చారని కొని యాడారు. యోగా కేవలం ఒక రోజు చేసే ప్రక్రియ కాదని, అది మన జీవనశైలిలో భాగం కావాలని మానసిక ప్రశాంతతకు, శారీరక ఆరోగ్యానికి, క్రమశిక్షణకు యోగా ఎంతో ఉపయోగపడుతుందని ప్రతి ఒక్కరూ నిత్యం కొంత సమయాన్ని యోగాకు కేటాయించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలన్నారు. మండల తహసీల్దార్ బి.పాపారావు, ఎంపీడీవో, మండల విద్యాశాఖ అధికారులతోపాటు వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థులు తల్లిదండ్రులు, యువత, ఓంశాంతి సభ్యులు, ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా ఆసనాల వేశారు.

## నిరక్షరాస్యత నిర్మూలనకే అక్షరాంధ్ర ఉల్లాష్

**- వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు**

**మందస, జూన్ 21(వార్త):** సమాజంలో వయోజనులలో నిరక్షరాస్యతను నిర్మూలిస్తూ, అవగాహన పెంచే ఉద్దేశ్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఉల్లాష్ అక్షరాంధ్ర కార్యక్రమం చేపట్టినట్లు వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. సరియాపల్లి పంచాయతీలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛఆంధ్రా స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొని సచివాలయంలో జరుగుతున్న అక్షరాంధ్ర డేటా ఎంట్రీను పరిశీలిస్తూ మాట్లాడారు. గ్రామాల్లో స్వచ్ఛందంగా చదువు నేర్పడానికి ఆసక్తి ఉన్న వారిని వాలంటీర్ టీచర్ గా గుర్తించి వారి పరిధిలో పది మంది లెర్నర్స్ ను నమోదు చేయించాలని తెలిపారు. కేవలం అంకెలు, అక్షరాలు పోల్చడంతో పాటు నిజ జీవితంలో ఉపయోగపడేటట్లు ప్రాథమిక ఆరోగ్య విద్య, ఆర్థిక అక్షరాస్యత, లీగల్ లిటరసీ, డిజిటల్ లిటరసీ, ప్రకృతి వ్యవసాయం తదితర అంశాలపై ప్రత్యేకంగా వయోజనులకు అవగాహన కల్పిస్తారని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శిస్టు రమేష్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ పుచ్చ సునీత, వెలుగు గ్రామ సంఘం అసిస్టెంట్ భీమారావు తదితరులు పాల్గొన్నారు.



## పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



**పలాస, జూన్ 21(వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్‌లో, పాతపట్నం అమ్మవారి ఆలయం సమీపంలో నిరుపేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సేవా కార్యక్రమాల్లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ విద్యార్థులకు ఆదివారం పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ "విద్య అనేది జీవితాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన ఆయుధం. పుస్తకాలు మనిషికి జ్ఞానాన్ని, వ్యక్తిత్వాన్ని, విలువలను అందించే మౌన గురువులు. ప్రతి చిన్నారి చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే పుస్తకాలతో స్నేహం చేయాలి" అని అన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ఎల్లప్పుడూ విద్య, వైద్యం, సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు చేరువవుతున్నారని ఆయన పేర్కొన్నారు. పుస్తకాలు అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ "థ్యాంక్యూ శిరీషమ్మ" అంటూ తమ కృతజ్ఞతలు తెలిపారు. వారి తల్లిదండ్రులు కూడా ఈ కార్యక్రమాన్ని అభినందించారు. ఈ సేవా కార్యక్రమానికి స్థానిక యువకుడు రవితేజ పుస్తకాల సమీకరణలో సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నర్సిపురం నీటి సంఘం అధ్యక్షుడు గణేష్, నాలుగో వార్డు సీనియర్ నాయకుడు రామకృష్ణ, రవితేజ, స్థానిక నాయకులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యోగాతోనే మానసిక ప్రశాంతత




**పలాస, జూన్ 21 (వార్త):** యోగాతోనే మానసిక ప్రశాంతత చేగుతుందని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటలక్ష్మి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా కార్యక్రమం పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి అధ్యక్షతన నిర్వహించగా ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి. మధు ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి వివిధ యోగాసనాలను ప్రదర్శించి చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి మాట్లాడుతూ యోగా యొక్క ప్రాముఖ్యతను వివరించారు. యోగా ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని, ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి. వెంకటరమణ, లైబ్రేరియన్ బి. నరసింహులు, సైన్స్ విభాగాధిపతి ఎన్ శ్రీనివాస్ పట్నాయక్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

**పలాస, జూన్ 21 (వార్త):** సర్ పై అవగాహన కలిగి ఉండాలని పలాస మండల తెలుగు యువత అధ్యక్షుడు కిక్కిర ఢిల్లీరావు అన్నారు. నకిలీ ఓటర్లను తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టిన సర్ పై (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో బొడ్డపాడు గ్రామ పంచాయతీ సచివాలయంలో బీఎల్ఓ, బీఎల్ఏలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తమ ధ్రువపత్రాలను అందించి, ఓటు పున: పరిశీలన చేయించుకోవాలని ఆయన కోరారు. అధికారులకు సహకరించాలని సూచించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

**- నిత్యజీవితంలో యోగా భాగం కావాలని బగ్గు అర్చన పిలుపు**

**-అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహణ**



**నరసన్నపేట, జూన్ 21(వార్త):** మానసిక ప్రశాంతతకు, శారీరక దృఢత్వానికి యోగా అద్భుతమైన సాధనమని, ప్రతి ఒక్కరూ యోగాను తమ నిత్యజీవితంలో భాగం చేసుకోవడం ద్వారా మాత్రమే సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించగలరని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన అన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "యోగాంధ్ర" కార్యక్రమంలో ఆమె పాల్గొని యోగా ప్రాధాన్యాన్ని వివరించారు. నరసన్నపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు బగ్గు అర్చన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రాచీన భారతదేశం ప్రపంచానికి అందించిన అత్యంత విలువైన కానుక యోగా అని కొనియాడారు. యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాకుండా, అంతర్గత శక్తిని మేల్కొలిపి మానసిక ప్రశాంతతను కలిగించే జీవన విధానమని పేర్కొన్నారు. మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లు, పెరుగుతున్న ఒత్తిడి కారణంగా అనేక ఆధునిక వ్యాధులు మనుషులను వేధిస్తున్నాయని, అలాంటి సమస్యలకు యోగాసనాలు, ప్రాణాయామం సమర్థవంతమైన పరిష్కారంగా నిలుస్తాయని ఆమె చెప్పారు. ముఖ్యంగా యువత చదువు, ఉద్యోగాల రీత్యా ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు ప్రతి రోజూ కనీసం అరగంటపాటు యోగా సాధన చేయాలని సూచించారు. ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'యోగాంధ్ర' వంటి వినూత్న కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం అభినందనీయమని బగ్గు అర్చన పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి కుటుంబం యోగాను అలవాటు చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

## శ్రీకాకుళం

## ప్రజలకు మెరుగైన సేవలో రెవెన్యూ శాఖ

**-మందస తహసీల్దార్ కింతలి రామకృష్ణ**



**మందస, జూన్ 21(వార్త):** ప్రజలకు మెరుగైన సేవలను రెవెన్యూశాఖ అందిస్తోందని మందస తహసీల్దార్ కింతలి రామకృష్ణ అన్నారు. మందసలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రెవెన్యూ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తహసీల్దార్ కార్యాలయం పారదర్శకంగా పని చేస్తోందని చెప్పారు. భూ రికార్డుల నిర్వహణ, ఆదాయ, కుల, నివాస ధ్రువపత్రాల జారీ, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో రెవిన్యూ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు మరింత పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించేందుకు కృషి చేయాలని సిబ్బందికి ఆయన కోరారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులను అభినందించి, సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ వి.జీవన్ కుమార్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఐను కలిసిన 'పూలే పెరియార్ జైభీమ్ చైతన్యవేదిక'



**మందస, జూన్ 21(వార్త):** మందస మండల సబ్ఇన్స్పెక్టర్(ఎస్.ఐ)కె.కృష్ణప్రసాద్ ను 'పూలే పెరియార్ జైభీమ్ చైతన్యవేదిక'ను మర్యాదపూర్వకంగా కలిశారు. పొత్తంగి-సిరిపురం గ్రామం ఇటీవల ఏర్పాటు చేసిన "పూలే పెరియార్ జైభీమ్ చైతన్యవేదిక" నూతన కార్యవర్గ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్.ఐ గారికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వేదిక ప్రతినిధులు మాట్లాడుతూ మహాత్మాజ్యోతిరావు పూలే, పెరియార్, బాబాసాహెబ్ డా.బి.ఆర్.అంబేద్కర్‌ల విప్లవాత్మక ఆశయాల స్ఫూర్తితో, "అక్షరమే ఆయుధం చైతన్యమే మన బలం" అనే నినాదంతో గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన చైతన్యవేదిక ముఖ్య ఉద్దేశ్యాలను, విధివిధానాలను ఎస్.ఐ. వివరించారు. గ్రామంలో విద్యా వ్యాప్తికి, సామాజిక చైతన్యానికి యువత చేస్తున్న ఈ ప్రయత్నాన్ని, వేదిక యొక్క ఆశయాలను ఎస్.ఐ. అభినందించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలకు తమ వంతు ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వేదిక అధ్యక్షులు సంక. కాళిదాసు, ఉపాధ్యక్షులు నగిరి. తారకేశ్వరరావు, నిర్వహణ కార్యదర్శులు సంక నారాయణరావు, కదంబాల ప్రవీణ్ కుమార్, కోశాధికారి ఇప్పిలి హేమసుందర్, క్రియాశీల కార్యదర్శులు తెప్ప లోహిదాస్, గేదెల పాపారావు, నగిరి గణపతి పాల్గొన్నారు.

## ఏపీ మోడల్ స్కూల్‌లో యోగా దినోత్సవం



**సారవకోట, జూన్ 21 (వార్త):** సారవకోట మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్ ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించినట్లు మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) మడ్డు వెంకటరమణ తెలిపారు. స్థానిక పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొని వివిధ యోగాసనాలు ప్రదర్శించారు. యోగ గురువు సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన యోగా సాధనలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగ ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యార్థి దశ నుంచే యోగను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని ఎంఈఓ సూచించారు. ప్రస్తుత కాలంలో చదువుల ఒత్తిడి, జీవనశైలి మార్పుల కారణంగా విద్యార్థుల్లో ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో యోగ సాధన ఆరోగ్యవంతమైన జీవనానికి దోహదపడుతుందని ఆయన అన్నారు. ప్రతిరోజూ కొంత సమయం యోగకు కేటాయించడం ద్వారా ఏకాగ్రత, క్రమశిక్షణ, మానసిక ప్రశాంతత పెరుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. యోగా ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని నిర్వాహకులు తెలిపారు.

## బ్రాహ్మణతర్లా హైస్కూల్ ప్లస్‌లో ..

**పలాస, జూన్ 21 (వార్త):** బ్రాహ్మణతర్ల హై స్కూల్ ప్లస్ లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తారకేశ్వర పండా ఆధ్వర్యంలో మండల స్థాయిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల అధికారులైన విద్యాశాఖ అధికారి శ్రీనివాసు రావు, మండల అభివృద్ధి శాఖ అధికారి కే .వసంత్ కుమార్, మండల డిప్యూటీ ఎంపీడీవో ఎస్. ఉమాపతి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఆర్. బాల శంకర్, గ్రామ పెద్దలు వ్యాయామం ఉపాధ్యాయులు చంద్రశేఖర రావు సునీత మేడం, పాఠశాల సిబ్బంది హెల్త్ డిపార్ట్మెంట్ సభ్యులు గ్రామ సచివాలయం సభ్యులు గ్రామ పెద్దలు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు.



# ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ బడులు



**మందస, జూన్ 21(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచడానికి, విద్యావ్యవస్థ బలోపేతానికి మందస మండల విద్యాశాఖ అధికారి ఎం.లక్ష్మణరావు చేస్తున్న కృషి అత్యంత అభినందనీయమని ఉపాధ్యాయులు, గ్రామస్తులు కొనియాడారు. మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల(అంబుగాం)లో ప్రధానోపాధ్యాయు కాసం శ్రీనివాసరావు అధ్యక్షతన విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ ఎం.లక్ష్మణరావు చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు గున్న రమేష్ తన సొంత ఖర్చులతో రూ.3,000లు విలువైన నోట్ పుస్తకాలను విద్యార్థులకు ప్రతీ సంవత్సరం ఉచితంగా అందించడం విశేషం.

### ఐదో ఉపాధ్యాయ పోస్టు మంజూరు

ఈ సందర్భంగా ఎంఈఓ లక్ష్మణరావు మాట్లాడుతూ, అంబుగాం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడంతో ప్రభుత్వం నుంచి 5వ ఉపాధ్యాయ పోస్టు మంజూరైనట్లు సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఉపాధ్యాయులు అంబుగాం, నోతువార గ్రామాల్లో ప్రత్యేక అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించి ప్రైవేట్ బడి పిల్లలను చేర్పించడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. మందస మండలంలో ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ బడుల్లోకి నేటికి 501 మంది విద్యార్థులు చేరారని వెల్లడించారు. ప్రైవేట్ స్కూళ్ల భారం తప్పడం వల్ల ఈ ఏడాది మండలంలోని తల్లిదండ్రులకు సుమారు రూ.20 కోట్ల మిగిలాయని, ఆ సొమ్మును పిల్లల ఉన్నత చదువులకు దాచుకోవాలని కోరారు. ఏపీఆర్ఎస్ కు ఎంపికైన ఆరుగురు విద్యార్థులను ఆయన అభినందించారు.


### అడ్మిషన్ డ్రైవ్ చేసిన ఎంఈఓకు ఘన సన్మానం

పాఠశాల ఉపాధ్యాయుడు దాసరి ఈశ్వరరావు మాట్లాడుతూ ఎంఈఓ లక్ష్మణరావు పనితీరు జిల్లాలోనే టాప్‌లో ఉందన్నారు. మండలంలో ప్రభుత్వ బడుల బలోపేతానికి ఆయన రాత్రి 10 గంటల వరకు గ్రామాల్లో పర్యటించి అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారని కొనియాడారు. ఆయన చొరవతోనే అంబుగాం పాఠశాలలో కొత్తగా 20 మంది ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు చేరి, మొత్తం సంఖ్య 68కి చేరిందని తెలిపారు.


పాఠశాల అభివృద్ధికి మరియు ఉపాధ్యాయ పోస్టు మంజూరుకు విశేష కృషి చేసిన ఎంఈఓ లక్ష్మణరావును ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పూలమాలలు వేసి, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు జి.సాయమ్మ, ఎస్ఎంసీ వైస్ చైర్పర్సన్ ఆర్.లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త జొటియ మాధవి, ముడిమించి నవీన్ యాదవ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం

**మందస, జూన్ 21(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతాంగాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని కూటమి నాయకులు అన్నారు. మందస మండలంలోని మూలిపాడు గ్రామంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చన్నాయుడు, పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష ఆదేశాల మేరకు పలాస నియోజకవర్గ పరిధిలోని మందస మండలంలో గల మూలిపాడు గ్రామంలో 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్(2026-27) సంవత్సరానికి సంబంధించి మొదటి విడత పంపిణీ కార్యక్రమం నిర్వహించబడిందన్నారు. పెట్టుబడి సాయం కింద ఈ పథకం ద్వారా లబ్ధిదారులైన ప్రతీ రైతు ఖాతాలోకి రూ.7,000లు నగదును నేరుగా డీబీటీ ద్వారా జమ చేయడం జరిగిందన్నారు. ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరికట్ల విఠల్ రావు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందనే దానికి ఈ 'అన్నదాత సుఖీభవ' పథకమే నిదర్శనమని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మందస మండల అధికారులు, మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, కార్యదర్శి సాలీన మాధవరావు, నాయకులు దాసరి తాతారావు ప్రత్యేకంగా పాల్గొన్నారు. వీరితో పాటు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, జనసేన, కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ రైతులు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. నగదు బదిలీపై స్థానిక రైతాంగం హర్షం వ్యక్తం చేస్తూ, సాగు పనుల ప్రారంభ సమయానికి ఈ సాయం అందడం ఎంతో ఊరటనిచ్చిందని కొనియాడారు.




## శ్రీముఖలింగేశ్వర ఆలయంలో ఘనంగా యోగా దినోత్సవం



**జలుమూరు, జూన్ 21(వార్త):** శ్రీముఖలింగంలో కొలువైన శ్రీముఖలింగేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది విద్యార్థులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొని యోగా సాధన చేశారు. ఆలయ దేవాదాయ శాఖ ఈవో ఏడుకొండలు మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన జీవన విధానానికి యోగా ఎంతో దోహదపడుతుందని అన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. యోగా ద్వారా ఏకాగ్రత పెరగడంతో పాటు ఒత్తిడి తగ్గుతుందని, ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. ప్రముఖ యోగ గురువు, ఉపాధ్యాయుడు రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో యోగా ఆసనాలు, శ్వాసాభ్యాసాలు, ధ్యాన విధానాలను పాల్గొనేవారికి ప్రదర్శించారు. విద్యార్థులు, గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొని యోగా ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా యోగా దినోత్సవం నిర్వహించడం ద్వారా యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. యోగా సాధనతో శరీర దారుఢ్యం పెరగడంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, విద్యార్థులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గంగివలస కేజీబీవీలో..



**పోలాకి, జూన్ 21 (వార్త):** గంగివలసలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో యోగా సాధన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో బీఎస్ ప్రకాష్ పాల్గొని మాట్లాడుతూ, పాఠశాలలో 150 మంది విద్యార్థినులతో యోగా దినోత్సవాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే యోగా అలవాటు చేసుకుంటే శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. యోగా గురువు ప్రియాంక మాట్లాడుతూ, ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు యోగా చేస్తే జ్ఞాపకశక్తి పెరగడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వివరించారు. యోగా ద్వారా ఒత్తిడి తగ్గి ఏకాగ్రత పెరుగుతుందని, చదువులో కూడా మంచి ఫలితాలు సాధించేందుకు దోహదపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినులు వివిధ యోగా ఆసనాలను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన జీవనశైలి అలవాటు చేసుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## పోలేరులో లోవోల్టేజీ సమస్య పరిష్కారం

**కంచిలి, జూన్ 21(వార్త):** కంచిలి మండలం పోలేరు గ్రామంలో ఎంతోకాలంగా విసిగిస్తున్న లో వోల్టేజ్ సమస్యకు ఎట్టకేలకు విముక్తి లభించింది. మండల టిడిపి అధ్యక్షుడు మాదిన రామారావు కృషితో విద్యుత్ శాఖ అధికారులు కొత్తగా ఆ గ్రామంలో ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీంతో ఆ గ్రామానికి ఓల్టేజి సమస్య పరిష్కారమై ప్రజల్లో ఆనందం వ్యక్తం అవుతుందని రామారావు పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ అలాగే విద్యుత్ శాఖ అధికారులకు రామారావు కృతజ్ఞతలు తెలిపారు.



# అల్లేరు భూములను కాపాడండి

## - డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు సిలగాం రైతుల లేఖ



**సోంపేట, జూన్ 21 (వార్త):** కవిటి మండలం సిలగాం పంచాయతీలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఉన్న సుమారు 21 ఎకరాల విలువైన మెట్టు భూములను అన్యాక్రాంతం కాకుండా చూడాలని ఎంజేఆర్ పూలే రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు లేఖ రాసింది.

ఈ భూముల్లో ఇదివరకు కవిటి, కంచిలి, సోంపేట, మందస, ఇచ్ఛాపురం తదితర మండలాల ఉద్యాన పంటలు పండించే రైతులకు అవసర మైన నాణ్యమైన మొక్కలు ఉత్పత్తి చేసి రాయితీ ధరలపై విక్రయించి రైతులకు విశేషమైన సేవలందించారని గుర్తు చేశారు. అల్లేరు భూములుగా పిలవబడే ఉద్యాన శాఖ భూములలో మొక్కలు పెంచే మదర్ ప్లాంట్లుగా ఎంతో విశేషమైన సేవలు అందించేందుకు తోడ్పడ్డాయని గుర్తు చేశారు. అంతేకాకుండా కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో అధ్య యనం చేసిన ఈ ప్రాంత కొబ్బరి రైతుల ఉత్పత్తిదారుల సంస్థగా పేర్కొనబడే చికోఫ్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా కోకోనట్ పార్క్ ఏర్పాటుకు మరోవైపు సన్నాహాలు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటు వంటి భూములను ఏపీఐఐసీకి ఇటీవల ప్రభుత్వం బదలా యించిందన్నారు. తద్వారా పారిశ్రామికీకరణకు అవకాశాలు ఉన్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు మేలు జరిగే విధంగా ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని కోకోనట్ పార్క్ ఏర్పాటుకు కృషి చేయాలని సంస్థ అధ్యక్షుడు బీన ఢిల్లీ రావు, బొర్ర వెంకట రమణ, సమళ్ళ జయసూర్య తదితర అనేకమంది రైతుల సంతకాలతో ఈ లేఖను పంపించారు.

## యోగాతో రుగ్మతలు మాయం




**పలాస, జూన్ 21 (వార్త):** యోగాతో రుగ్మతలు మాయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పాలవలస వైకుంఠరావు అన్నారు. పలాసలోని పెంట వీధి పాఠశాలలో ఆదివారం యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశ ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీ ఆలోచనతో అంతర్జాతీయ యోగా దినోత్సవం చేపట్టడం జరిగిందని చెప్పారు. భారతీయ జనతా పార్టీ శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షులు, టౌన్ ప్రధాన కార్యదర్శి హనుమంతు రామారావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా యోగా దినోత్సవం



**పలాస, జూన్ 21(వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలాస ఆర్డీవో, పురపాలక సంఘ ప్రత్యేక అధికారి ఆర్.అప్పలరాజు ఆధ్వ ర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు, యువత, మహిళలు, విద్యా ర్థులు, ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాస నాలు, ప్రాణాయామాలు నిర్వహించారు. యోగా పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలాస మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, కుటుంబ సభ్యులకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సత్యసాయిలో యోగా దినోత్సవం





**పలాస, జూన్ 21(వార్త):** అంతర్జాతీయ యోగా దినోత్సవం శ్రీ సత్యసాయి విద్యావిహార్ రామకృష్ణపురములో ఆదివారం ఘనగా నిర్వహించారు. క్రీడ ఉపాధ్యాయులు కిరణ్ రెడ్డి పర్యవేక్షణలో 300 మంది విద్యార్థిని విద్యార్థులుతో యోగా ప్రక్రియ చేపట్టారు. ముఖ్యంగా సూర్య నమస్కారములు, కపాలభాతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ సత్యసాయి సేవాసంస్థలు పలాస జోనల్ కన్వీనర్ బైరాగి మాస్టర్ హాజరవ్వగా ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ఉప అధ్యక్షులు తాలాసు శ్రీను, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, శ్రీ సత్యసాయి సేవాసమితి పలాస కన్వీనర్, ఇప్పిలి తిరుమల, డోకి జగదీశ్వం రావు, ఉపాధ్యాలు అనుదీప్, మురళి, సూర్యతేజ, లావణ్య కృష్ణ, చంద్రశేఖర్, తారక్, అశోక్, మమత, దంతేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై అడ్డదిడ్డంగా పశు సంచారం

### - నిర్లక్ష్యంగా వదిలేసి యజమానులపై అధికారులు చర్యలు శూన్యం

### - తరచూ వాహనాల ప్రమాదాలు

**సంతబొమ్మాళి, జూన్ 20(వార్త):** నౌపడ లో పశువులు ప్రధాన రహదారులపైన సంచరిస్తూ ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నాయి. కొంతమంది పశువులను ఇలా రోడ్డుపై వదిలేయడంతో రోడ్లపైనే సేద తీరుస్తున్నాయి. నౌపడ బస్టాండ్ నుంచి స్టేట్ బ్యాంకు వరకు నిత్యం రోడ్డులో పదుల సంఖ్యలో పశువులు కూర్చుంటున్నాయి. పశువులు రోడ్డుపైనే ఉండడంతో పలుమార్లు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. నిత్య రోడ్లపై పశువులు రాత్రి పగలు తేడా లేకుండా సంచారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ, వాహనదారులు కొన్ని సందర్భాల్లో అదుపుతొప్పుతున్నా, యజమానులు మాత్రం వాటిని కట్టకుండా నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. రాత్రి వేళలో పశువులు కొన్ని దుకాణాల ముందు పడుకొని అశుభ్రం చేస్తున్నాయి. ఈ మార్గాలు వెళ్లే సమయంలో పశువులు గాని వాహనదారులు గాని ప్రమాదంలో గాయాలు అయితే ఎవరిది బాధ్యతని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాత్రి వేళలో పశువుల సంతల మారుతుంది. అధికారులు పశువులను సంరక్షకుల ద్వారా రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని వాహనదారులు పేర్కొంటున్నారు. పశు సంచార వ్యవహారం చిన్న విషయం లాగే కనిపించినప్పటికీ వీటివల్ల ప్రమాదాలకు గురైన వారికి అదేంత తీవ్రమైనదో అవగతమవుతుంది. పాలు మాత్రమే పితుకొని పోషణకు పట్టించుకోకుండా మూగజీవులను ఇలా నిర్లక్ష్యంగా రోడ్లపై వదిలేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. శనివారం సాయంత్రం ఏడు గంటలకి రోడ్లపై పశువులు సంచరించడం, ఓ పక్క వర్షం కరెంటు లేక చీకటిలో పశువులు ఉండటంతో వాహనదారులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా ఆవులను రోడ్లపై వదిలిన యజమానులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



# రెవెన్యూ ఉద్యోగం నిరంతర బాధ్యత



**సోంపేట, జూన్ 21 (వార్త):** రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేయడం ఒక నిరంతర బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. సోంపేట తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ బి.అప్పలస్వామి ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో అత్యంత కీలకమైన బాధ్యతతో కూడిన రెవెన్యూ ఉద్యోగం ప్రతి ఉద్యోగి జీవితంలో ఒక మరపురాని మైలురాయిగా నిలవాలని కోరారు. రెవెన్యూ శాఖ పై ఆధారపడి ఎన్నో కీలకమైన వ్యవహారాలు ముడిపడి ఉన్నాయని గుర్తు చేశారు. విద్యార్థులు,రైతులు, సామాన్య ప్రజలు ఇలా ప్రతి ఒక్కరికి నిరంతరం సేవలందిస్తూ రెవెన్యూ ఉద్యోగులు పనిచేయడమే కాకుండా ప్రకృతి విపత్తుల వేళ సమయానుకూలంగా స్పందించి ప్రజలకు సేవ చేయడం రెవెన్యూ ఉద్యోగుల సేవల్లో ఎంతో కీలకమని అన్నారు. తుఫానులు,వరదలు, అగ్ని ప్రమాదాలు, భూకంపాలు మొదలైన విపత్తుల్లో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా సేవలు అందించడం రెవిన్యూ ఉద్యోగులకు సాహసంతో కూడినదని అన్నారు. ఇటువంటి కీలక బాధ్యతలు నిర్వహిస్తూ సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందిన రెవెన్యూ శాఖ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిందని గుర్తు చేశారు.

### రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలో చాలా కాలం పని చేసి పదవి విరమణ పొందిన అశోక్ పాణిగ్రాహి, దామోదర్ రావు లను సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. అలాగే ఈ శాఖలో సీనియర్లుగా పనిచేస్తున్న తహసిల్దార్ అప్పలస్వామి, డిప్యూటీ తాసిల్దార్ ఉమామహేశ్వరరావు,మండల సర్వేయర్ నాగేశ్వరరావు లను దుస్సాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. అంతకుముందు కార్యాలయ ఆవరణలో పరిశుభ్రత చేపట్టారు. కార్యక్రమంలో ఆర్ ఐ నిఖిల్,వి ఆర్ ఓ లు,సిబ్బంది,సి ఎస్ డి టి కూర్మారావు,సివిల్ సప్లై డీలర్లు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా సీఎం సహాయనిధి



**జి.సిగడాం, జూన్ 21(వార్త):** పేదవారికి సీఎం సహాయనిధి ఆపదలో అండగా నిలుస్తోందని విజయనగరం పార్లమెంట్ సభ్యులు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం రణస్థలం మండలం కోటపాలెం గ్రామంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యలు పరిష్కారానికే ప్రజా దర్బారని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతలను స్వీకరించి సమస్యలపై సంబదిత అదికారులతో మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఆనంతరం ఆనందపురం పంచాయితీ అబోతుల పేట గ్రామానికి చెందిన తెలుగు దేశం కార్యకర్త మొయ్యి రామారావు కు బ్రెయిన్ సర్జరీ కు వైద్య ఖర్చులు నిమిత్తం సీఎం సహాయ నిధి ద్వారా రూ.82 వేల చెక్కును ర రామారావు బార్యనకు గ్రామ నీటి సంఘం అద్యక్షులు చిత్తిరి తిరపతి, పోగిరి నారాయణరావు సమక్షంలో విలువైన చెక్కును అందజేశారు.మాట్లాడుతూ ఆపద సమయాల్లో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మెరుగైన వైద్యానికి అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందొచ్చని తెలిపారు. ప్రతి కార్యకర్తకు ప్రజలకు ఆరోగ్య భద్రతలో కూటమి ప్రభుత్వం ముందడుగులో ఉంటుందన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం అందించండి



**పలాస, జూన్ 21 (వార్త):** పేకాట, ఆన్లైన్ గేమ్స్ ఎవరైనా ఆడిన గంజాయి నాటుసారా అమ్మిన మాకు సమాచారం అందించాలని కాశీబుగ్గ ఎస్ ఐ ఆర్ నరసింహమూర్తి చెప్పారు. కాశీబుగ్గ పోలీసులుతో ఆర్.నరసింహమూర్తి సిబ్బందితో కలిసి పలాస మండలంలో పద్మనాభ పురం గ్రామాన్ని రాత్రి సందర్శించారు. గ్రామ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి నారీ శక్తి గురించి, కొత్త చట్టాల గురించి రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా అవగాహన కల్పించి, గ్రామంలో దేవాలయాలు, మసీదులు, చర్చ్ లు ఏమైనా ఉంటే వాటికి సీసీ కెమెరాలు అమర్చమని, అదేవిధంగా గ్రామంలో ఏమైనా పండుగలు గాని, ఉత్సవాలు జరిగినప్పుడు గాని ఊర్లు వెళ్ళినపుడు పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, బెట్టింగ్, పేకాట, గంజాయి, నాటు సారా అక్రమ రవాణా, అమ్మకం గురించి అవగాహన కల్పించి, బాల్యవివాహాలు, మహిళలపై జరుగు నేరాలు, 112 కాల్ ఉపయాగం, మొదలైన వాటి గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

## బైదులాపురంలో అపారిశుధ్యం



**సారవకోట, జూన్ 20 (వార్త):** బైదులాపురం గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇళ్ల పక్కనే మురుగు నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వ్యాపిస్తోందని, కాలువలు శుభ్రం చేయకపోవడంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి ప్రజలు ఆందోళన చెందుతున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలోని పలు వీధుల్లో మురుగు నీరు సక్రమంగా పారక ఇళ్ల సమీపంలోనే నిల్వ ఉండటంతో అసహనకర పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు పడకముందే ఇలాంటి పరిస్థితి ఉండటంతో వర్షాకాలంలో సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీటి నిల్వ కారణంగా దుర్వాసన వ్యాపించడమే కాకుండా దోమలు, ఈగలు పెరిగి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. ఈ సమస్యపై గ్రామ ప్రజలు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే కాలువలను శుభ్రం చేసి మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పారిశుద్ధ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా గ్రామపంచాయతీ అధికారులు, సంబంధిత శాఖలు తక్షణ చర్యలు చేపట్టాలని, కాలువల శుభ్రతతో పాటు మురుగు నీటి పారుదల సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఎస్‌బీఐ ఉద్యోగుల రక్తదానం



**సోంపేట, జూన్ 20(వార్త):** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ నిర్మాణకర్తలలో ఒకరైన కామ్రేడ్ తారకనాథ్ 22వ వర్ధంతి సందర్భంగా సామాజిక బాధ్యతలో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు శనివారం కంచిలి ఎస్బిఐ శాఖలో భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పలాస నుంచి ఇచ్ఛాపురం వరకు ఉన్న స్టేట్ బ్యాంకు శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు 50 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఉద్యోగులు ఎంతో ఉత్సాహంగా ఈ శిబిరంలో పాల్గొన్నారు. అంతకుముందు కామ్రేడ్ తారకనాథ్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. యూనియన్ కోసం నిరంతరం కృషి చేసిన తారకనాథ్ సేవలను స్మరించుకున్నారు. స్టాఫ్ యూనియన్ శ్రీకాకుళం రీజనల్ సెక్రటరీ కామ్రేడ్ సిహెచ్ వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ శ్యాం కుమార్, లోకల్ సెక్రెటరీ ధనుంజయ, జోగారావు,సంతోష్ కుమార్, ప్రేమ్ కుమార్, అనూష,నరసయ్య, వెంకటేష్, ఉష, శ్రీహరి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శిగా తమ్మినాన సుధాకర్

**పలాస, జూన్ 20(వార్త):** జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శిగా వజ్రపుకొత్తూరు మండలం మహాదేవుపురం గ్రామం తమ్మినాన సుధాకర్ ను కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కిల్లి లక్ష్మణరావు అధ్యక్షతన బిజెపి జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వర రావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ సుహాసిని ఆనంద్, రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని చేతులు మీదుగా బిజెపి జిల్లా కార్యాలయంలో శనివారం నియమించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అన్నేపు ఉమామహేశ్వర రావు, నరసన్నపేట బ్లాక్ .1 పోకతోట సింహాచలం, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు పాలవలస వైకుంఠ రావు, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కణితి విష్ణుమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పూజారి చెల్లయ్యా, కిసాన్ మోర్చా జిల్లా పదధికారులు నాయకులు పాల్గొన్నారు.

ఈ పదవి ఇచ్చినందుకు రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పి వి ఎన్ మాధవ్ కు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామికు, రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్, ఉత్తరాంధ్ర ఇంచార్జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్ కు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాల్ కు, రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావుకు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబ్జి,శవ్వాన ఉమామహేశ్వరి, పూర్వ జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వర రావుకు తమ్మినాన సుధాకర్ ధన్యవాలదములు తెలియజేశారు. ఈ పదవి వలన పార్టీ పట్ల మరింత బాధ్యతతో, చిత్తశుద్ధితో, విధేయత తో,అనుగుణంగా పనిచేస్తూ పార్టీ బలోపేతం కోసం అన్నివర్గాలను కలుపుకొని మరింత ముందుకు తీసుకుపోవడానికి కృషి చేస్తానని చెప్పారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546